
# భయం గుప్పిట్లో



మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది.

రోడ్డు మీద ట్రాఫిక్ రద్దీగానే ఉంది. అయితే ప్రొద్దున 9 – 11, సాయంత్రం 5 – 7 గంటల మధ్య ఉండే రద్దీతో పోలిస్తే ఈ మహా నగరంలో ఆ సమయంలో ఉన్న ట్రాఫిక్ ఒక లెక్కలోది కాదు. శనివారాలు కేంద్ర ప్రభుత్వ ఆఫీసులకు సెలవు. ఆదివారం అందరికీ సెలవు. అందువల్ల ఈ రెండు రోజులూ, మిగతా ఐదురోజులతో పోలిస్తే ట్రాఫిక్ తక్కువగానే ఉంటుంది.

ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కి వచ్చేవారు తరచుగా ఒక విమర్శ చేస్తుంటారు– 'ఇక్కడి ప్రజలు మంచివారు. ఆత్మీయంగా మాట్లాడతారు. సహాయక గుణం ఉన్నవారు. కాని, బాగా చదువుకున్నవాళ్ళలో కూడా చాలామందికి బొత్తిగా ట్రాఫిక్ సెన్స్ ఉండదు. కార్లేమిటి, స్కూటర్లేమిటి, సైకిళ్లేమిటి– ఎవరికి వారు తాము వెళ్లిపోవడమే చూసుకుంటారు కాని, ట్రాఫిక్ నిబంధనలను అసలు పట్టించుకోరు. ఈ విషయంలో జైపూర్ కూడా అంతే. ఈ రెండు నగరాల ప్రజల విషయంలో అన్నీ బాగున్నా, బాగుండని లక్షణం ఇదొక్కటే!' అని. ఈ విషయంలో ఎవరో అన్నారని మనం బాధపడవలసిన అవసరం లేదు. ఆత్మవిమర్శ చేసుకుంటే ఆ మాటలు అక్షరాలా నిజమని మనకీ అనిపిస్తుంది.

చౌరస్తాలో ఆటోమాటిక్ ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర రెడ్ లైట్ ఆన్‌లో ఉంది.

ఎల్లో లైట్ ఇంకా రాకుండానే చాలా స్కూటర్‌లు లైన్ దాటేసి రన్నింగ్ రేస్‌లో లాగా బాగా ముందుకి వచ్చి సిద్ధంగా ఉన్నాయి. నిజానికి– ఎల్లో లైట్ ఉన్న సమయంలో కూడా వెళ్లకూడదు. ఎందుకంటే... ఆ సమయంలో గ్రీన్ లైట్ ఆన్‌లో ఉండగా వెళ్తున్న వాహనాలు, ఆ సమయంలో పూర్తిగా వెళ్లిపోవాలి. దాంతో ట్రాఫిక్ క్లియర్ అవుతుంది కనుక అప్పటివరకూ రెడ్ లైట్ ఉన్న కారణంగా వేచి ఉన్నవారు గ్రీన్ లైట్ రాగానే సులువుగా వెళ్లవచ్చు. ఈమాత్రం రూల్స్ పాటిస్తే చాలా యాక్సిడెంట్‌లు జరగవు. కాని, మనవాళ్ళకి అంతమాత్రం ఓపిక ఎక్కడుందీ?!

ట్రాఫిక్ కానిస్టేబుల్ ఒకతను చౌరస్తాలో ఒకప్రక్కగా నిలబడి అవసరానికి తగ్గట్లుగా విజిల్ వేస్తూ ట్రాఫిక్‌కి డైరెక్షన్స్ ఇస్తున్నాడు.

కొంచెం దూరంలో యూనిఫారంలో ఉన్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ తన మోటారుసైకిల్ రోడ్డుకి ప్రక్కగా ఆపి, దానివెనక నిలబడి ఉన్నాడు. మోటారుసైకిల్ మీద రసీదు పుస్తకాలూ, ఇంకేవో పుస్తకాలూ బొత్తిపెట్టి ఉన్నాయి. ఆయనకు కొంచెం దూరంలో మరో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉన్నాడు. వాళ్ళ డ్యూటీ... ట్రాఫిక్ రూల్స్‌ని అతిక్రమించిన వారిని అటకాయించి పట్టుకుని కేసులు పెట్టడం, చలాన్ చేసి పైసలు కట్టించుకుని రసీదులు ఇయ్యడం, అవసరమైతే వెహికిల్‌ని సీజ్ చేయడం!

ఉరుకులు, పరుగులతో ఆఘమేఘాల మీద గమ్యస్థానం చేరాలన్న ఆత్రుతతో ఉన్నవారిలో సురేష్ ఒకడు.

అతను ఒక ప్రసిద్ధ ప్రైవేట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్. ఆరోజు మూడు గంటలకి కంపెనీ బోర్డు మీటింగ్ ఉంది. దానికి ఏర్పాట్లు చూడాల్సిందీ, అవసరమైన కాగితాలు తయారుచేయవలసిందీ, సమాచారం అందించవలసిందీ అతనే!

మీటింగ్‌కి ఒక గంట ముందే వెళ్లి అన్నీ చూసుకుందామనుకున్నాడు. ఇంటి నుంచి ముందుగానే బయలుదేరాడు. కాని, అనుకోకుండా మూడు నాలుగు చోట్ల ట్రాఫిక్ జాంలలో ఇరుక్కుపోయాడు. ఊళ్లో ఏదో పార్టీ ర్యాలీలు నిర్వహిస్తున్న కారణంగా చాలాచోట్ల ఇలా ట్రాఫిక్ జాంలు ఏర్పడ్డాయి. వాటిలో ఒకసారి ఇరుక్కుంటే ముందుకి వెళ్లడానికీ వీలుండదు.., వెనక్కి తిరగాలన్నా కుదరదు. ఆ ట్రాఫిక్ క్లియర్ అయ్యేదాకా భజన చేయాల్సిందే!

ఈ అవాంతరాలతో బాగా ఆలస్యం కావడంతో... చాలా కంగారులో ఉన్నాడు సురేష్. రెడ్ లైట్ పోయి ఇంకా ఎల్లో లైట్ రాకుండానే స్కూటర్ స్టార్ట్ చేసి ఒక్క ఉదుటున నడిపాడు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంటనే విజిల్ వేశాడు. అతనితోపాటు ప్రకాష్ ప్రక్కనున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా విజిల్ వేశాడు.

అయినా సురేష్ ఆగలేదు.

ఆగితే పోలీసులు పట్టుకోవడం, వాళ్ళు నాలుగు నీతిసూత్రాలూ, పది రూల్సూ చెప్పి, అనేక యక్షప్రశ్నలు వేసి చివరకు చలాన్ చేయడం... మామూలు వ్యవహారం! అందులో ఇరుక్కుంటే ఇంక ఆఫీసుకి టైముకి వెళ్లలేడు. అందుచేత ఏమైతే అదే అవుతుందిలే... అని దేవుడి మీద భారం వేసి స్కూటర్ వేగం పెంచాడు సురేష్- వెనక్కి తిరిగి చూడకుండా.

చేసిన తప్పు ఒప్పుకుంటే ఎవరికైనా సానుభూతి కలుగుతుంది. ఆ తప్పుని కప్పిపుచ్చుకోవాలని చూస్తే ఎలాంటివారికైనా కోపం వస్తుంది. అటువంటిది- మండుటెండలో ట్రాఫిక్ డ్యూటీ చేసే పోలీసులకు తిక్కరేగడంలో ఆశ్చర్యం లేదు.

ఎప్పుడైతే సురేష్ పదేపదే విజిల్స్ వేస్తున్నా ఆగకుండా సాగిపోయాడో, ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌కి సహజంగానే కోపం వచ్చింది. తన మోటార్‌సైకిల్ మీదుంచిన రసీదు పుస్తకాలు వగైరాలను ప్రక్కనున్న కానిస్టేబుల్‌కి అప్పచెప్పి తన మోటార్‌సైకిల్‌ను స్టార్ట్ చేశాడు. సిగ్నల్ గ్రీన్‌లో ఉండడంతో ఏ ఆలస్యం లేకుండా సురేష్‌ని వెంబడించసాగాడు.

తనను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంబడిస్తుండడాన్ని సురేష్ గమనించాడు. అతని పైప్రాణాలు పైనే పోయాయి. అసలు అతనికి పసితనం నుంచే పోలీసులంటే చచ్చే భయం! చిన్నప్పుడు అన్నం తినక మారాం చేస్తుంటే- వాళ్ళమ్మ- "అదుగో... పోలీసు వస్తున్నాడు. అన్నం తినకపోతే నిన్ను ఎత్తుకుపోతాడు" అని భయపెట్టేది. ఆ భయంతో ఆకలి లేకపోయినా, రుచిగా లేకపోయినా తినేసేవాడు. అప్పటినుంచీ కూడా పోలీసులంటే

'యమదూతలు' అన్నంత భయం పట్టుకుంది అతనికి. పెద్దవాడయ్యాక పేపర్లలో పోలీసుల 'చిత్రహింసలు', 'లాకప్ డెత్‌లు' వంటి వార్తలు చదివాక ఆ భయం మరీ పెరిగిపోయింది. దాంతో సాధ్యమైనంతవరకూ పోలీసుల దరిదాపులకు వచ్చేవాడు కాదు. వారు కనిపిస్తే తప్పించుకు తిరిగేవాడు. అటువంటిది- ఈరోజున పోలీసు చేతిలో పడబోతున్నాడంటే వెన్నులోంచి వణుకు పుట్టింది.

ఆ భయంలో మరింత వేగంగా డ్రైవ్ చేయడం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను తప్పించుకోవడం కోసం సందులు, గొందులు, అడ్డదారుల వెంట వెళ్లడం మొదలుపెట్టాడు.

విసుగు చెందని విక్రమార్కుడిలాగా ప్రకాష్ అతన్ని అనుసరిస్తూనే ఉన్నాడు.

అలా కొంతదూరం ఈ దొంగాటకం సాగాక- సురేష్ స్కూటర్ ఆగిపోయింది. ముందుకి వెళ్లనని మొరాయించింది.

ఎంత కొట్టినా స్టార్ట్ కాలేదు.

చివరిబొట్టు దాకా ఫ్యూయల్ అయిపోయాక అది ఇంకేం స్టార్ట్ అవుతుంది? చేసేది లేక స్కూటర్‌కి స్టాండ్ వేసి ప్రక్కనే నిలబడ్డాడు రొప్పుతూ.

మరో రెండు నిముషాలలో ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ కూడా అక్కడికి వచ్చాడు. ఆయనా మోటార్‌సైకిల్‌కి స్టాండు వేసి నిలబడ్డాడు. ఆయన కూడా రొప్పుతున్నాడు.

ఆయన దగ్గరకు రాగానే- "సారీ సార్! అర్జంటు పని ఉండడం వల్ల సిగ్నల్ రాకుండానే బండిని నడిపాను. నేను చేసింది తప్పే!" అన్నాడు సురేష్ రొప్పుతూనే.

"మీ స్కూటర్ సైడ్‌హుక్‌కి ఉన్న బ్రీఫ్‌కేస్‌లో ఏముంది?" అని అడిగాడు ప్రకాష్ రొప్పుతూనే.

సాధారణంగా పోలీసులు మర్యాదగా మాట్లాడడం అరుదు. ఏకవచన ప్రయోగం చేస్తూ గద్దించి మాట్లాడతారు. అటువంటిది- ప్రకాష్ 'నీ' అనకుండా 'మీ' అని సంబోధించడం ఆశ్చర్యం వేసింది సురేష్‌కి.

"నా బ్రీఫ్‌కేస్‌లో కంపెనీ కాగితాలున్నాయి సార్!" అంటూ సైడ్‌హుక్ వైపు చూశాడు.

అక్కడ బ్రీఫ్‌కేస్ లేదు.

సురేష్ పైప్రాణాలు పైనే పోయాయి.

"సార్..!" అని గట్టిగా అరిచాడు.

"సార్... అందులో చాలా ముఖ్యమైన కంపెనీ కాగితాలు, మనీ వాలెట్ కూడా ఉన్నాయి సార్! అది కనిపించడం లేదు. ఎక్కడో పడిపోయినట్లుంది" అన్నాడు. ఏడుపు ఒక్కటే తరువాయి సురేష్‌కి.

"సార్... మూడు గంటలకి కంపెనీ బోర్డ్ మీటింగ్ ఉంది. దానికి సంబంధించిన కాగితాలన్నీ అందులోనే ఉన్నాయి. ఇప్పుడు ఆ కాగితాలు పోయాయంటే నా ఉద్యోగమే పోతుంది సార్!" అంటూ కళ్లొత్తుకుంటూ అన్నాడు.

ప్రకాష్ తన మోటార్‌సైకిల్‌కి అటువైపున ఉన్న హుక్ నుంచి ఒక బ్రీఫ్‌కేస్ తీశాడు. "ఇది మీదేనా చూడండి!" అన్నాడు ఎత్తి చూపుతూ.

దానివంక చూశాడు సురేష్.

"సార్..!" అని మళ్లీ గట్టిగా అరిచాడు.

"ఇది నాదే సార్..!" అన్నాడు మెరిసే కళ్ళతో. పట్టరాని ఆనందంతో అతని కళ్ళంబట నీళ్లు కారుతున్నాయి.

"మీరు రెడ్ సిగ్నల్ ఉండగానే స్కూటర్‌ని జోరుగా స్టార్ట్ చేశారు. అప్పుడు ఈ బ్రీఫ్‌కేస్ కింద పడిపోయింది. కంగారులో మీరు దానిని గమనించలేదు. వెంటనే దానిని ట్రాఫిక్ కానిస్టేబుల్ తీసుకువచ్చి నాకిచ్చాడు. మీ అదృష్టంకొద్దీ అప్పటికింకా ట్రాఫిక్‌ని వదలలేదు. వదిలివుంటే వాహనాల కింద నలిగి మీ బ్రీఫ్‌కేస్ తుక్కుతుక్కు అయ్యుండేది. మేము విజిల్స్ వేసింది మిమ్మల్ని ఆగమని చెప్పడానికే. కాని, మీరు ఆగకుండా వెళ్లిపోయారు. అందుకే ఆ బ్రీఫ్‌కేస్‌ని తీసుకుని మీకు అందజేయడానికే మిమ్మల్ని వెంబడించాను" అన్నాడు ప్రకాష్.

సురేష్ తన చెవులను తాను నమ్మలేకపోయాడు.

"సార్- పోలీసులు కూడా..." అంటూ ఏదో చెప్పబోయాడు.

"పోలీసులలో కూడా మంచివాళ్ళుంటారా... అనేగా మీ అనుమానం?! చూడండీ... పోలీసులూ మనుషులే! అందరు మనుషులలో లాగానే పోలీసులలో కూడా మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ ఉంటారు. అయితే- దండుకునే అవకాశం ఎక్కువ ఉంటుంది కనుక అక్రమంగా సంపాదించే వాళ్ళు మిగతావర్గాల్లోకంటే ఎక్కువుంటారు. నిజానికి- పోలీసులు అంటే రక్షణ కల్పించే వారు. అందువల్ల జనం వారినుంచి ఎక్కువ సేవలు ఆశిస్తారు. అవి వారు ఆశించినంతగా లభించకపోతే సహజంగా అసంతృప్తి చెందుతారు. నేరస్తులు మంచిమాటలకు లొంగరు. బెదిరిస్తేనో, నాలుగు బాదితేనో కాని నిజం ఒప్పుకోరు. ఇలాంటి వారితో నిత్యం వ్యవహరించవలసి రావడంతో- సహజంగానే చాలామంది పోలీసుల మాటలు గద్దించినట్లు ఉంటాయి. నిజానికి- పోలీసులు చాలామంది జనం అనుకునేటంత దుర్మార్గులు కారు. మంచివాళ్ళూ ఎందరో ఉన్నారు. పదండి... మీకు టైం అవుతోంది. ఇదిగో... మీ బ్రీఫ్‌కేస్ తీసుకుని వెళ్లండి!" అన్నాడు ప్రకాష్.

"సార్... మీకు ఎలా నా కృతజ్ఞత చెప్పాలో తెలియడం లేదు. మరో ప్రాబ్లెం కూడా ఉంది!" అన్నాడు సురేష్ నసుగుతూ.

"ఏమిటది?" ప్రశ్నార్థకంగా చూశాడు ప్రకాష్.

"నా వెహికిల్‌లో పెట్రోల్ అయిపోయింది సార్! అందుకే ఆగిపోయింది. లేకుంటే ఆగకుండా ఎలాగోలా మిమ్మల్ని తప్పించుకు వెళ్లిపోయేవాడినే! వెళ్లాకే బ్రీఫ్‌కేస్ పోవడం చూసి నెత్తీనోరూ బాదుకునేవాడిని. పెట్రోల్ అయిపోవడం నా మంచికే జరిగింది. కాని, ఇంకా నాలుగు కిలోమీటర్‌లు వెళ్లాలి. దారిలో పెట్రోల్ బంక్‌లు కూడా లేవు. ఇప్పుడు సమయానికి వెళ్లడం ఎలాగా... అనేదే నా బాధ!" అన్నాడు సురేష్.

"అదా మీ ప్రాబ్లెం! నా బండిలోంచి కొంత పెట్రోల్ తీసి మీ బండిలో పోస్తాను. దాంతో మానేజ్ చేసుకోండి" అన్నాడు సురేష్ టాంకర్ కీని తీస్తూ.


"సార్... మీరు నిజంగా దేవుడు సార్!" అన్నాడు సురేష్ పట్టలేని ఆనందంతో.

"అప్పుడే అనకండి. పోయిన సొమ్ము సొంతదారునికి అందజేయడం మా బాధ్యత. అందుకే అందజేశాను. అలాగే చట్టాన్ని అతిక్రమించిన వారిని చలాన్ చేయడం కూడా మా డ్యూటీ! అందుకే రెడ్ సిగ్నల్ ఉండగా దాటినందుకు మీకు ఫైన్ వేస్తున్నాను" అంటూ చలాన్ పుస్తకాన్ని డిక్కీలోంచి తీశాడు ప్రకాష్.

"పోలీసు విధులను ఇంత సక్రమంగా నిర్వర్తిస్తున్న మీకు 'సెల్యూట్' సార్!" అని, "సార్- మీరిచ్చిన పెట్రోల్‌కి పైసలు..." అంటూ నసిగాడు.

"అది నేను ఫ్రెండ్లీగా ఇచ్చింది. ఇబ్బందిలో ఉన్న ఎవరికైనా ఇచ్చేవాడినే. దాని మీరు ఇయ్యనక్కరలేదు. చలాన్ పైసలు మాత్రం ఇయ్యండి చాలు!" అంటూ రసీదు చింపి చేతిలో పెట్టాడు ప్రకాష్.

– సెల్యూట్ మాస పత్రిక... మే ' 2002



**అది ఎలా..?**

కంపెనీ యజమాని : గాలిలో ప్రయాణం అన్నిటికంటే వేగమని మీకు తెలుసుగా! మరి.., ఆ దిక్కుమాలిన రైల్లో పడి వెళ్లి వ్యాపారమంతా నాశనం చేశారెందుకు?

కొత్త మేనేజర్ : నిజమే సార్.. కాని, నేను గాలిలో ఎలా ఎగురుతాను. నేనేమైనా పక్షినా?